మల్కాజిగిరి పార్లమెంట్‌లో 12 నామినేషన్లు

ఎన్నికల అధికారి గౌతమ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ స్థానానికి మంగళవారం 12 మంది అభ్యర్థులు నామినేషన్లు వేసినట్లు మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు. అలియన్స్ ఆఫ్ డెమోక్రాటిక్ రిఫారమ్స్ పార్టీ అభ్యర్థిగా కామ్రేడ్ సత్యం రెండు సెట్లు, తల్లాడ వెంకటేశ్వర్లు ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారన్నారు. భారత రాష్ట్ర సమితి(బీఆర్‌ఎస్) అభ్యర్థిగా రాగిడి లక్ష్మారెడ్డి తరఫున రెండుసెట్ల నామినేషన్ పత్రాలు దాఖలైనట్లు పేర్కొన్నారు. రాష్ట్రీయ మానవ పార్టీ అభ్యర్థిగా కె.వి.గీత కుమారి, విడుతలై చిరుతాయిగల్ కట్చ్ అభ్యర్థిగా మంచిని ఆంజనేయులు రెండుసెట్లు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారన్నారు. శ్రమజీవి పార్టీ అభ్యర్థిగా జక్కుల నర్సింలు, రాష్ట్ర సామాన్య ప్రజా పార్టీ అభ్యర్థిగా కొండా అప్పారావు రెండు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేశారన్నారు. బహుజన్ ముక్తి పార్టీ అభ్యర్థిగా కె.పి.విజయ కుమార్, అంబేడ్కర్ నేషనల్ కాంగ్రెస్ అభ్యర్థిగా చేపూరి రాజు నామినేషన్ దాఖలు చేయడం జరిగిందన్నారు. స్వతంత్ర అభ్యర్థులుగా గంటా చరితరావు, దొంతుల భిక్షపతి, ముస్త్యాల రామచంద్రం ఒక సెట్ నామినేషన్ పత్రాలు దాఖలు చేసినట్లు మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు.

అందరి సహకారంతో సమస్యలు పరిష్కరిస్తా

కీసర ఎంపీపీ ఇందిరా లక్ష్మీనారాయణ



కీసర మండల ప్రజా పరిషత్తు సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఇందిర

కీసర: తాగునీరు, విద్యుత్ తదితర సమస్యలను అందరి సహకారంతో పరిష్కరిస్తానని కీసర ఎంపీపీ ఇందిరా లక్ష్మీనారాయణ అన్నారు. కీసర మండల ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పలు గ్రామాలకు మిషన్ భగీరథ నీరు అందకపోవడంతో ఏర్పడిన నీటి ఎద్దడిని నివారించేందుకు చర్యలు చేపడతామన్నారు. చీర్యాల, యాద్గిరిపల్లి, కీసర మండల కేంద్రంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు తాగునీరు సరఫరా చేయాలని సంబంధిత అధికారులను ఆదేశిస్తామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏర్పడిన విద్యుత్ సమస్యను పరిష్కరించి, అవసరమైన చోట అదనపు గదులను నిర్మిస్తామన్నారు. కీసరలో కబ్జాకు గురవుతున్న సర్వే నెంబర్ 315ను పరిరక్షిస్తామన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎలాంటి నిధులు కేటాయించలేమని చెప్పారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వైద్యాధికారి సరిత వివరించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ సత్తిరెడ్డి, ఎంపీడీఓ గ్యామ, రైతు సేవా సహకార సంఘ చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మమ అనిపించారు..



ఎంపీపీ చాంబర్‌లో మండల పరిషత్ సమావేశం



అధికారుల కోసం సిద్ధంగా సమావేశ మందిరం

మేడ్చల్: ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని నామమాత్రంగా నిర్వహించి మొక్కుబడిగా ముగించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి మండలంలోని 10మంది ఎంపీటీసీ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, సింగిల్ విండో చైర్మన్లతో కలిసి మండలంలోని అన్ని శాఖల అధికారులతో 20 నుంచి 30 అంశాలతో ఎజెండా రూపొందించి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సమావేశం నిర్వహించి సమస్యలకు పరిష్కారం చూపడం, గత సమావేశంలో ప్రారంభించి పనులు వివరాలు, అవి ఎంతవరకు వచ్చాయి తదితర అంశాలతో సాధారణంగా మండల పరిషత్ సమావేశాలు నిర్వహిస్తారు.

ఎంపీపీ చాంబర్‌లో సమావేశం..

మండల పరిషత్ సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ముందుగానే ప్రకటించి సమావేశ మందిరాన్ని ముస్తాబు చేశారు. కానీ సమావేశాన్ని మండల పరిషత్ అధ్యక్షురాలు రజితరాజమల్లారెడ్డి చాంబర్‌లో నిర్వహించి ఎలాంటి చర్చలు లేకుండా ముగించేశారు. ఎంపీటీసీలు, ఇతర సభ్యులు, వచ్చిన అధికారులు కూల్‌డ్రింక్‌లు, టీలు తాగి గంటపాటు టైంపాస్ చేసి వెళ్లిపోయారు. ప్రజలు గ్రామాల్లో ఎన్నో ఇబ్బందులు పడుతున్నా ఎలాంటి చర్చలు చేయకుండా కేవలం హాజరు కోసం సమావేశాన్ని నిర్వహించి చేతులు దులుపుకున్నారు. సమావేశానికి 8 మంది ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు, ఇద్దరు సింగిల్ విండో చైర్మన్లు, కో ఆప్షన్ సభ్యులు అందరూ హాజరయ్యారు. సమావేశం మొదట్లో తక్కువ మంది వచ్చారని చాంబర్‌లో సమావేశం నిర్వహించాం. గ్రామాల్లో సమస్యల పరిష్కారం కోసం అధికారులకు ఆదేశాలు ఇచ్చాం. ఎన్నికల నేపథ్యంలో చాలా శాఖల అధికారులు సమావేశానికి రాలేదు. సమావేశంలో వైస్ ఎంపీపీ వెంకటేషం, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీడీఓ, సింగిల్ విండో చైర్మన్లు రందీప్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం



గుండ్లపోచంపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు



మేడ్చల్‌లో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

మేడ్చల్: మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరుతూ పట్టణంలోని వివిధ కాలనీల్లో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేసి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్ హంస కృష్ణగౌడ్, నాయకులు హేమలతారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ లక్ష్మణ్, ప్రేందాస్ తదితరులు పాల్గొన్నారు.

గుండ్లపోచంపల్లిలో బీజేపీ ప్రచారం

మేడ్చల్‌రూరల్: బీజేపీ గుండ్లపోచంపల్లి మున్సిపల్ అధ్యక్షుడు ఉషిగారి శ్రీనివాస్ ముదిరాజ్ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో బీజేపీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. బీజేపీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ గెలుపు ఖాయమైందని, మెజార్టీ కోసం ప్రచారం నిర్వహిస్తున్నామని వారు వివరించారు. కౌన్సిలర్ సరస్వతి, నాయకులు కిషన్, కృష్ణ, నవీన్, సురేందర్ పాల్గొన్నారు.

సై నువ్వా.. నేనా..?

మూడు పార్టీలకు కీలకమే..

- మల్కాజిగిరిలో వేడెక్కిన ఎన్నికల ప్రచారం
- కాంగ్రెస్ గెలుపు సీఎం రేవంత్‌రెడ్డికి ప్రతిష్టాత్మకం
- మోదీ చరిష్మా.. ఈటల సుదీర్ఘ రాజకీయం అనుభవంపై బీజేపీ ఆశలు
- ఎమ్మెల్యేలపైనే బీఆర్‌ఎస్ గెలుపు భారం





రాగిడి లక్ష్మారెడ్డి



ఈటల రాజేందర్



సునీత మహేందర్‌రెడ్డి

సాక్షి, మేడ్చల్ జిల్లా: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో గెలుపు మూడు ప్రధాన పార్టీలకు కీలకంగా మారింది. కాంగ్రెస్ అభ్యర్థిగా పట్నం సునీతా మహేందర్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థిగా ఈటల రాజేందర్, బీఆర్‌ఎస్ అభ్యర్థిగా రాగిడి లక్ష్మారెడ్డి బరిలో నిలువగా, త్రిముఖ పోటీ నెలకొంది. అభ్యర్థుల బలాబలాలు, వ్యూహ ప్రతివ్యూహాలపై అధిష్టానాలు దృష్టిసారించాయి. సొంత పార్టీల్లోని ముఖ్య నేతల ద్వంద్వ వైఖరి, అంకితభావంతో పని చేసే కిందిస్థాయి కార్యకర్తల పనితీరుకు ఇది గీటురాయిగా నిలుస్తోంది. అందరినీ సమన్వయం చేసుకుని విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని, విమర్శలకు తావీయకుండా నడుచుకోవాలని మూడు పార్టీల అగ్రనేతలు సూచించడంతో బరిలో నిలిచిన మూడు పార్టీల అభ్యర్థులకు పరీక్షగా మారింది.

కాంగ్రెస్‌కు కొత్త అభ్యర్థిత్వం..

కాంగ్రెస్ అభ్యర్థి సునీత మహేందర్‌రెడ్డి పార్లమెంటరీ ఎన్నికల పోరులో నిలవడం ఇదే ప్రథమం. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(పీసీసీ) సానుకూలతతో అభ్యర్థిగా రాణించగలిగినప్పటికీ అసంతృప్తులను దారికి తెచ్చుకోవడం పరీక్షే. మహిళ కావడం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటం, ఇటీవల బీఆర్‌ఎస్‌తో సహా ఇతర పార్టీలకు చెందిన పలువురు నేతలు, ప్రజాప్రతినిధులు కాంగ్రెస్‌లో చేరడం కలిసొచ్చేలా ఉంది. సిట్టింగ్ సీటుతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహించిన లోక్‌సభ నియోజకవర్గం కావడంతో ఎన్నికలను కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. పైగా మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని నేతలందర్నీ కూడా సమన్వయం చేసే బాధ్యతను నేరుగా ముఖ్యమంత్రి, మాజీ ఎంపీ, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తీసుకోవడం పట్నం సునీత మహేందర్‌రెడ్డికి కలిసి వస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అలాగే, లోక్‌సభ అభ్యర్థిగా సునీత మహేందర్‌రెడ్డి సోమవారం నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభకు కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు ఆశించిన స్థాయిలో పాల్గొనగా, ముఖ్యఅతిథిగా హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారాన్ని మరింత వేడెక్కించడం ద్వారా కేడర్‌లో కొత్త ఊపు తీసుకురావడం గెలుపునకు అనుకూలం అంటూ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

బీజేపీ టికెట్ ఈటలకు వరించడమే..

బీజేపీ టికెట్ ఈటల రాజేందర్‌ను వరించడమే ఓ అనూహ్య మలుపు. సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన నేతగా పేరున్నప్పటికీ, సంస్థాగత ఆచరణలతో నడిచే బీజేపీ సిద్ధాంతాలకు కొత్త కావడం కొంత ఇబ్బందికరమైన అంశమే. ప్రధానమంత్రి మోదీ చరిష్మా, హిందుత్వ నినాదం, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అండదండలు కలిసివచ్చే అంశాలు. పార్టీలోని క్రియాశీలక నాయకులు సమన్వయంతో అనుకూలమైన అనుచరులతోనే ప్రచారం నిర్వహించడం కలిసొచ్చే అంశంగా రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఇప్పటికే ప్రధాని మోదీ మల్కాజిగిరిలో రోడ్ షో నిర్వహించడం, కేంద్ర మంత్రి అమిత్ షాతో పాటు పలువురు కేంద్ర మంత్రులు నియోజకవర్గంలోని ఎన్నికల సభల్లో పాల్గొని కేడర్‌ను ఉత్తేజపరచడం గెలుపునకు అనుకూలంగా పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

బీఆర్‌ఎస్ గెలుపు ఎమ్మెల్యేలకు ప్రతిష్టాత్మకం

బీఆర్‌ఎస్ టికెట్ దక్కించుకోవడంలో విజయం సాధించిన రాగిడి లక్ష్మారెడ్డి పార్టీలో నెలకొన్న అనిశ్చితిని ఛేదించాల్సి ఉంది. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ బలంగానే ఉంది. కంటోన్మెంట్ ఎమ్మెల్యే మృతి చెందగా, ఉప ఎన్నిక జరుగుతోంది. మిగతా ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ ఎమ్మెల్యేలు ఉన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్‌లో బీఆర్‌ఎస్ గెలుపు పార్టీ ఎమ్మెల్యేలకు ప్రతిష్టాత్మకంగా మారింది. పార్టీకి చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు కోసం ఎన్నికల ప్రచారంలో చురుకైన పాత్ర నిర్వహించడంలో దూకుడుగా వ్యవహరించడం లేదని తెలుస్తోంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాత్రం పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని శాసనసభ స్థాయి సమావేశాలకు హాజరై కేడర్ బీఆర్‌ఎస్ గెలుపు కోసం ఎన్నికల ప్రచారంలో పాల్గొనేలా సమాయత్తం చేస్తున్నారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి కుటుంబ ఆస్తులు రూ.82.54 కోట్లు

- అప్పులు రూ.10.20 కోట్లు, నగదు రూ.5.70 లక్షలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రాగిడి లక్ష్మారెడ్డి కుటుంబానికి సంబంధించిన ఆస్తులు రూ.82.54 కోట్లు ఉన్నట్లు ఎన్నికల అధికారికి సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఇందులో చరాస్తులు రూ.20.42 కోట్లు ఉన్నాయి. రాగిడి కుటుంబానికి అప్పులు రూ.10.20 కోట్లు ఉన్నాయని తెలిపారు. కుటుంబం(భార్యాభర్తల) చేతిలో ప్రస్తుతం నగదు రూ.5.70 లక్షలు ఉండగా, బంగారం 2,000 గ్రాములు, వెండి నాలుగు కిలోలు, ఒక డైమండ్ ఉన్నట్లు తెలిపారు. కుటుంబానికి నాలుగు వాహనాలు ఉన్నాయి. రాగిడి లక్ష్మారెడ్డిపై ఒక పోలీసు కేసు నమోదు కాలేదని పేర్కొన్నారు.

సంస్కృతిలో ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోండి



మల్లాది రమాకాంత్‌రెడ్డి

ఘట్‌కేసర్: పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష కోసం మున్సిపాలిటీలోని కొండాపూర్ సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాలలో కోసం ఔత్సాహిక విద్యార్థులకు ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నట్లు ఆ కళాశాల డైరెక్టర్ మల్లాది రమాకాంత్‌రెడ్డి తెలిపారు. కళాశాలలో మంగళవారం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ప్రయత్నాలకు మద్దతిచ్చే లక్ష్యంతో కోచింగ్ అవసరమైన అంశాలు, మార్గదర్శకాలను అందిస్తామన్నారు. విద్యార్థులు అనుకున్న కేరీర్‌లో విజయం సాధించడానికి సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష-24 కోసం ఈనెల 25 నుంచి ఉచిత కోచింగ్ ఇస్తున్నామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు అదనపు సమాచారం, రిజిస్ట్రేషన్ కోసం ఫోన్: 95055 18259, 95502 08072.

వేసవిలో ఇమ్యూనిటీ కోసం..

సాక్షి, సిటీబ్యూరో: అధిక స్వేదం, అలసట కారణంగా కోల్పోయే రోగనిరోధక శక్తి తిరిగి పొందేందుకు ఆహారంలో కొన్ని తప్పక చేర్చుకోవాలని ప్రముఖ వెల్‌నెస్ కన్సల్టెంట్ షీలా కృష్ణస్వామి సూచించారు. వేసవిలో ఆరోగ్యం అంశంపై ఓ సమావేశంలో ఆమె మాట్లాడుతూ అనారోగ్యాలను ఎదుర్కొనేందుకు విటమిన్ ఇ, జింక్, ఫోలేట్, ఐరన్ అందించే బాదం పప్పులు అల్పాహారంతో పాటు తీసుకోవాలని, తెల్ల రక్తకణాల ఉత్పత్తికి ఇన్ఫెక్షన్స్‌ను ఎదుర్కొనేందుకు నారింజ, నిమ్మ, బత్తాయి, ద్రాక్ష వంటి సిట్రస్ పండ్లు వినియోగించాలన్నారు. యాంటీ బాక్టీరియల్ లక్షణాలకు పేరొందిన వెల్లుల్లి, యాంటీ ఆక్సిడెంట్లు అందించే బచ్చలి, మునగాకు, పుదీనా తదితర ఆకు కూరలు వాడాలని సూచించారు.

కాలేషా ఆధ్వర్యంలో పండ్ల పంపిణీ



సుక్కమ్మబస్తీలో చిన్నారులకు పండ్లు పంపిణీ చేస్తున్న కాలేషా

జవహర్‌నగర్: మేడ్చల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని జవహర్‌నగర్ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ కార్యదర్శి, కాంగ్రెస్ నాయకులు టి.కాలేష ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక చిన్నారులతో కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సేవతోనే సంతృప్తి ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్ ఆధ్వర్యంలో మేడ్చల్ నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. షర్మిల, షేక్ ముర్తుజా హైదర్, షేక్ అజ్మతుల్ హైదర్, నూర్ లైజ్ ఫాతిమా, సూరజ్, సాధన, ఆస్మ పాల్గొన్నారు.

మద్యం విక్రేతలపై కేసు నమోదు

పోచారం: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తులపై పోచారం పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. నారపల్లి సమీపంలోని ఎంజేఆర్ స్క్వేర్ మాల్ ఎదుట అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో ఆ ప్రాంతాన్ని పోలీసులు తనిఖీలు చేశారు. అదే చోట జాదవ్ నరేందర్(29) మద్యం విక్రయించడాన్ని పోలీసులు గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నాడు. అతడి వద్ద లభించిన మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే కొర్రెముల బస్టాప్ సమీపంలో ఉన్న ఇంట్లో బెల్టు షాపు నిర్వహిస్తున్న పులిగిల మాధవి(30) వద్ద లభించిన పలు బ్రాండ్ల మద్యం బాటిళ్లను కూడా స్వాధీనం చేసుకుని, ఇరువురిపై కేసు నమోదు చేశారు.

వైభవంగా రథోత్సవం



శామీర్‌పేట్: శామీర్‌పేట మండలం అలియాబాద్ శ్రీసీతారామచంద్ర స్వామి జాతర మంగళవారం వైభవంగా జరిగింది. జాతర సందర్భంగా తెల్లవారుజామున స్వామివారి రథోత్సవాన్ని నిర్వహించగా భక్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రథంలో ఊరేగుతున్న స్వామివారికి మహిళలు మంగళ హారతులు పట్టారు.

ఓఆర్‌ఆర్‌పై రోడ్డు ప్రమాదం

డీసీఎం డ్రైవర్ మృతి

ఘట్‌కేసర్: ఓ లారీ డీసీఎంను ఢీకొనడంతో డీసీఎం డ్రైవర్ మృతి చెందిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. సీఐ సైదులు కథనం మేరకు ఓఆర్‌ఆర్‌పై అంబర్‌పేట్ వైపు వెళుతున్న లారీ అకస్మాత్తుగా మూడో లైన్ నుంచి నాలుగో లైన్‌కు రావడంతో వెనుక వస్తున్న డీసీఎం లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో డీసీఎం డ్రైవర్ ఇల్లాహి షేక్ (60) తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. డీసీఎం క్లీనర్ సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు బీఆర్‌ఎస్ నేత కేటీఆర్ రాక

బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి నామినేషన్ కార్యక్రమానికి హాజరు

సాక్షి, మేడ్చల్ జిల్లా: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి బుధవారం నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తున్న సందర్భంగా తూముకుంటలో నిర్వహించతలపెట్టిన ఎన్నికల సభకు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ హాజరుకానున్నారు. ఈ మేరకు తూముకుంట మున్సిపాలిటీ పరిధిలోని దొంగల మైసమ్మ ఆలయం పక్కనున్న మైదానంలో బీఆర్‌ఎస్ ఎన్నికల సభకు ఏర్పాట్లు చేశారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు జరిగే ఎన్నికల బహిరంగ సభలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుతో పాటు మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు సీహెచ్.మల్లారెడ్డి, వివేకానందగౌడ్, కృష్ణారావు, మర్రి రాజశేఖర్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, సుధీర్‌రెడ్డి పాల్గొంటారు. ఎన్నికల బహిరంగ సభ అనంతరం ర్యాలీగా బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి పార్టీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో కలిసి మేడ్చల్ కలెక్టరేట్‌లోని ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తారు.

సేవచేసే ప్రజా ప్రతినిధులను ఎన్నుకోవాలి



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

బోడుప్పల్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలకు సేవచేసే ప్రజా ప్రతినిధులను ఎన్నుకోవాలని జేజీఆర్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ గంగరాజు అన్నారు. విద్యార్థులతో 'అందరం ఓటేద్దాం... మా తల్లిదండ్రులచే ఓటు వేయిస్తాం'.. అనే నినాదంతో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటు వేయడం అందరి హక్కుగా భావించి ఓటేయాలని సూచించారు. ఈ ఎన్నికల్లో పోటీలో ఉండే ప్రజా ప్రతినిధులు ఇచ్చే ప్రలోభాలకు లొంగకూడదని పేర్కొన్నారు. నేటి భవిష్యత్తు యువతపైనే ఆధారపడి ఉందని చెప్పారు.

ఎప్పుడు పోతదో.. ఎప్పుడొస్తదో..?

- మేడ్చల్‌లో విద్యుత్ కోతలు
- స్పందించని అధికారులు



మేడ్చల్: ఒకనాడు కరెంటు ఉంటే వార్త.. నేడు కరెంటు పోతే వార్త.. ఈ మాటలను ప్రతిపక్షంలో ఉన్న నాయకులు తరచూ తమ ప్రసంగాల్లో అధికార పక్షాన్ని విమర్శించడానికి వాడుతుంటారు. వారి మాటలేమో గానీ నేడు మేడ్చల్ ప్రాంతంలో ఎప్పుడు కరెంట్ వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. అధికారికంగా ఎలాంటి కరెంట్ కోతలు లేకున్నా నిత్యం ఏదో ఒక ప్రాంతంలో గంటల తరబడి కరెంట్ ఉండటం లేదు. మేడ్చల్ మండలంలో రెండు మూడు గ్రామాలకు కలిపి ఒక సబ్‌స్టేషన్ ఉంది. మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలకు ప్రత్యేకంగా సబ్ స్టేషన్లు ఉన్నాయి. గత ప్రభుత్వ పాలనలో కరెంట్ సరఫరా మెరుగ్గా ఉండేది. ప్రభుత్వం మారిన తర్వాత అధికారుల్లో నిర్లక్ష్యం పెరిగిందో, ప్రకృతి సహకరించడం లేదో గానీ ఎప్పుడు పడితే కరెంట్ సరఫరా నిలిచిపోతోంది.

గంటల తరబడి..

మేడ్చల్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో గంటల తరబడి కరెంట్ సరఫరా ఉండటం లేదు. ఉరిమినా.. కాస్త గాలి వీచినా.. గంటల తరబడి కరెంటు సరఫరా ఉండటం లేదు. వేసవి ఉక్కపోతకు కరెంటు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళలో మరింత ఇబ్బంది తప్పడం లేదని పలు కాలనీల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైర్లు తెగాయని, గాలి, వానతో ఇబ్బందులు వచ్చాయని పైనుంచి సరఫరా నిలిచిపోయిందని అధికారులు సాకులు చూపుతున్నారు. విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా వారు స్పందించడం లేదని అంటున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో లోఓల్టేజీ, ఒక ఫేజ్ ఉంటే.. మరోఫేజ్ ఉండటం లేదు. అప్రకటిత కోతలతో వ్యాపారం దెబ్బతింటోందని చిరు వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎప్పుడుపడితే అప్పుడు కోతలే..

మేడ్చల్‌లో కరెంటు ఎప్పుడు కట్ చేస్తారో తెలియని పరిస్థితి. కరెంటు పోతే గంటల సమయం రావడం లేదు. రాత్రీ పగలు తేడా లేకుండా కోతలు విధిస్తున్నారు. ముందుగా సమాచారం ఇవ్వడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

– సోహెల్, మేడ్చల్, ట్రాన్స్‌పోర్ట్ యజమాని

ఇబ్బందులు లేకుండా సరఫరా చేస్తున్నాం.

గాలి, వర్షం వచ్చిన సమయంలో కరెంట్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నా మిగతా సమయంలో కరెంట్ సరఫరా సక్రమంగా ఉంటుంది. ప్రకృతిపరంగా ఏవైనా ఇబ్బంది తలెత్తితే వెంటనే మరమ్మతులు చేసి సాధ్యమైనంత త్వరగా సరఫరా చేస్తున్నాం. ఏఈలు, సిబ్బంది వెంటనే స్పందిస్తున్నారు.

– సత్యనారాయణ రాజు, మేడ్చల్ ఏడీఈ

ఘనంగా వీర హనుమాన్ శోభాయాత్ర



ఘట్‌కేసర్‌లో శోభాయాత్రను ప్రారంభిస్తున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలో శ్రీవీర హనుమాన్ శోభాయాత్రను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శివారెడ్డిగూడ శ్రీవీరాంజనేయ ప్రసన్నంజనేయ స్వామి ఆలయం ఆవరణ నుంచి ప్రారంభమైన యాత్ర అంబేడ్కర్ చౌరస్తా, ఎన్ఎఫ్‌సీనగర్, జోడిమెట్ల, నారపల్లి వరకు చేపట్టారు. అంబేడ్కర్ చౌరస్తాలో పూలవర్షం కురిపించి శోభాయాత్రకు ఘనస్వాగతం పలికారు. డీజేకు అనుగుణంగా యువత చేసిన నత్యాలు అలరించాయి. ఈ సందర్భంగా హనుమాన్ ఆలయాల్లో అన్నదానం నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, బీజేపీ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, మున్సిపల్ మండల అధ్యక్షుడు హనుమాన్, ప్రవీణ్‌రావు, బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ జెండా ఊపి శోభాయాత్రను ప్రారంభించారు.

మేడ్చల్: హనుమాన్ జయంతిని ప్రజలు మంగళవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. మేడ్చల్ మున్సిపాలిటీలు, మండలంలోని వివిధ గ్రామాల్లోని హనుమాన్ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. జయంతి వేడుకల్లో వివిధ పార్టీల నేతలు ఆలయాల్లో పూజలు చేశారు. ఆలయాల వద్ద పందిళ్లు వేసి ఆలయాలను అందంగా ముస్తాబు చేసి హనుమాన్ చాలీసా పారాయణం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల వద్ద భక్తులకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ కాలనీల్లో యువకులు ర్యాలీలు నిర్వహించారు.

హనుమజ్జయంతి వేడుకలు

పోచారం: యంనంపేట్‌లోని రంగనాయక స్వామి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఘట్‌కేసర్‌లో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులతో పాటు భక్తులు పాల్గొన్నారు.